# పురపాలక సంఘాల్లో ఆస్తి పన్నుపై..

# 5% ముందస్తు రిబేటుకు భారీ స్పందన

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని 132 పురపాలక సంఘాలలో (యుఎల్‌బి)లు 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం ఆస్తి పన్ను రిబేటు పథకానికి పన్ను చెల్లింపుదారుల నుండి విశేష స్పందన లభించింది. పాత బకాయిలు లేని పక్షంలో, ప్రస్తుత సంవత్సర పన్నును ముందస్తుగా చెల్లించే వారికి ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి మొత్తం డిమాండ్ రూ.1667.75 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.252.00 కోట్లు వసూలయ్యాయి. ఇది మొత్తం వసూళ్లలో 15.11 శాతంగా నమోదైంది. గత ఏడాది చివరికి వసూళ్లు రూ.204.05 కోట్లు (13.53 శాతం) ఉండగా, ఈ ఏడాది రూ.47.95 కోట్ల పెరుగుదల కనిపించింది. పన్ను చెల్లింపుదారులు తమ బకాయిలను చెల్లించి 5 శాతం రాయితీ ప్రయోజనం పొందేలా యుఎల్‌బిలు విస్తృత ప్రచారం చేపట్టాయి. రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లకు సి, డిఎంసిఏ తరచుగా మార్గదర్శకాలు జారీ చేస్తూ వసూళ్ల పురోగతిని పర్యవేక్షించింది.

**అత్యధిక వసూళ్లు చేసిన మున్సిపల్ కార్పొరేషన్లు..** గ్రేటర్ వరంగల్ (రూ.29.96 కోట్లు), కరీంనగర్ (రూ.17.70 కోట్లు), నిజామాబాద్ (రూ.14.22 కోట్లు), ఖమ్మం (రూ.11.16 కోట్లు), మహబూబ్‌నగర్ (రూ.10.16 కోట్లు) ముందంజలో నిలిచాయి.

**అత్యధిక శాతం వసూళ్లు చేసిన మున్సిపాలిటీలు..** మోయినాబాద్ (58.41 శాతం), గడ్డపోతారం (53.70 శాతం), జమ్మికుంట (49.18 శాతం), హుజూరాబాద్ (45.13 శాతం), ముదుచింతలపల్లి (37.84 శాతం) అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాయి.

**25 శాతం కంటే ఎక్కువ వసూళ్లు సాధించిన యుఎల్‌బిలు..** జమ్మికుంట, హుజూరాబాద్, రామగుండం




కార్పొరేషన్, ముదుచింతలపల్లి, అలియాబాద్, కోరుట్ల, చౌటుప్పల్, ఇస్నాపూర్, గుమ్మడిదల, సిద్దిపేట, మెట్‌పల్లి, మద్దూర్, తూప్రాన్, కోదాడ, అలంపూర్, కోతూర్, లక్సెట్టిపేట్, పెబ్బేర్, సూర్యాపేట, ఎల్లంపేట్ ఉన్నాయి.

**10 శాతం కంటే తక్కువ వసూళ్లు ఉన్న యుఎల్‌బిలు..** భూపాలపల్లి, కోహీర్, కేసముద్రం, బోధన్, బిచ్కుందా, కల్వకుర్తి, వేములవాడ, సదాశివపేట్, నక్రేకల్, ఆదిలాబాద్, స్టేషన్ ఘన్పూర్, ధర్మపురి, ఎదులాపురం, భైంసా, మెదక్, వనపర్తి, ఇబ్రహీంపట్నం, ఆసిఫాబాద్, ఇంద్రేశం, కొత్తగూడెం కార్పొరేషన్, హుస్నాబాద్ ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన ముదుచింతలపల్లి (37.84 శాతం), అలియాబాద్ (37.44 శాతం), ఎల్లంపేట్ (25.12 శాతం) యుఎల్‌బిలు అద్భుత ప్రదర్శన కనబరిచి, పన్ను ముందుగానే చెల్లించే అలవాటు ప్రజల్లో పెంచాయి. పన్ను చెల్లింపుదారులకు ఎస్ఎంఎస్‌ల ద్వారా గుర్తుచేసి, ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీ ప్రయోజనాన్ని వినియోగించుకునేలా అవగాహన కల్పించారు. ఫలితంగా పన్ను చెల్లింపుదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పన్నులు చెల్లించారు.

## 'పది' ఫలితాల్లో పుడమి పాఠశాల విద్యార్థుల ఉత్తమ ప్రతిభ




ప్రజాపక్షం/యాచారం : యాచారం మండల టాపర్‌గా పుడమి పాఠశాల హైస్కూల్‌కు చెందిన ఐ.కీర్తన 575 మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచింది. మండల పరిధిలోని మొగుళ్ళవంపు గ్రామానికి చెందిన కీర్తన పుడమి పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేశారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో పాఠశాల యాజమాన్యం గురువారం కీర్తనను ఘనంగా సన్మానించారు. తల్లిందండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. పుడమి పాఠశాల ప్రిన్సిపల్ ఉస్మాన్, వైస్ ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.

## భూదాన భూములు పరిరక్షించాలి



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : నియోజకవర్గంలో భూదాన భూములను పరిరక్షించి పేదలకు పంపిణీ చేయాలని సిపిఐ నాయకులు, సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శంకర్ నాయక్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గురువారం ఇబ్రహీంపట్నం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఓ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం రెవిన్యూ డివిజన్ పరిధిలో ఆదిభట్ల గ్రామ సమీపంలో సర్వే నెంబర్లు 51,52,53,67,68,77,78లలో అలాగే పోల్కంపలి గ్రామ సమీపంలో జనహర్షలో సుమారు 200ల ఎకరాలు, యాచారం మండలం ప్రాంతంలో ఫార్మా సిటీలో అక్రమంగా కబ్జాకు గురైన భూములపై సమగ్ర సర్వే నిర్వహించి భూధాన భూములన్నింటిని స్వాధీనం చేసుకోని పేద ప్రజలకు పంఫిణీ చేయాలని కోరారు.

## చట్టం ప్రకారమే పిల్లల దత్తత




ప్రజాపక్షం/ఫరూక్‌నగర్: అనధికారికంగా కాకుండా పిల్లలను చట్టబద్ధత ప్రకారం తీసుకుంటేనే భవిష్యత్‌లో ఎలాంటి నష్టం ఉండదని ఫరూఖ్‌నగర్ ఎంపిడివో బన్సీలాల్ అన్నారు. గురువారం ఫరూక్‌నగర్ ఎంపిడివో సమావేశ మందిరంలో షాద్‌నగర్ సిడిపివో ఉదయ ఆధ్వర్యంలో పిల్లల దత్తతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో బన్సీలాల్ మాట్లాడుతూ మధ్యవర్తులను ఆశ్రయించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకునే అస్కారం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు విజయ, సంధ్య, సిడిపిఒ ఉదయ, ఎఈఓ జంగయ్య, రజియా సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టపడి విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు



ప్రజాపక్షం/కేశంపేట: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయని పాపిరెడ్డిగూడ సర్పంచ్ శశిరేఖ యాదయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 10ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపించిన విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, ఉపాధ్యాయులు మల్లేష్, మహిళా అధ్యక్షురాలు రాణి, వార్డు సభ్యులు సురేష్, శ్రీను, గ్రామస్తులు సుదర్శన్, వినయ్, రమేష్, యాదయ్య, రవిలు పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం



ప్రజాపక్షం/కొందుర్గు: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి వివరించారు. గురువారం కొందుర్గు సింగిల్ విండో కార్యాలయంలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు మండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. దళారులను, మధ్యవర్తులను ఆశ్రయించి నష్టాలను చవిచూసే దానికంటే, నేరుగా విక్రయించుకుంటే ఆర్థికంగా లాభాలు పొందే అస్కారం ఉంటుందని, గిట్టుబాటు ధరతోపాటు బోనస్ సైతం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్టెం దామోదర్‌రెడ్డి, రాములు గౌడ్, మచ్చ సుధాకర్, సుదర్శన్‌గౌడ్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## తాగునీరు, మూత్రశాలలు ఏర్పాటు చేయండి



ప్రజాపక్షం/కొందుర్గు: తహసీల్దార్ ఆఫీసుకు వచ్చే ప్రజలకు తాగునీరు, మూత్రశాలల సౌకర్యాలు కల్పించాలని జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి దర్గా వెంకటేష్ కోరారు. గురువారం కొందుర్గు తహసీల్దార్ ఆజాం అలీకి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ మండల రెవిన్యూ ఆఫీస్‌కు వచ్చే ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్వతాపూర్ 3వ వార్డు సభ్యుడు కాశ యాదయ్య, బహుజన యువ నేత మీదికేరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ఆక్రమణలు, నిబంధనల ఉల్లంఘనలపై కఠిన చర్యలు

ఎంఎంసి కమిషనర్ టి. వినయ్‌కృష్ణా రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి రోడ్డుపైకి భవన నిర్మాణాలు, ఆక్రమణలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అల్వాల్, లోతుకుంట, గోల్నాక, రాజీవ్ నగర్ ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. రహదారిపై ర్యాంపులు నిర్మించి ఆక్రమణలు చేసినట్లు గుర్తించి వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ట్రేడ్ లైసెన్సుల అమలు, పరిశుభ్రత, నిర్మాణ వ్యర్థాల తొలగింపు పై సూచనలు ఇచ్చారు. దోమల నివారణ కోసం ఫాగింగ్, నాలాల శుభ్రత చేపట్టాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సందర్శించిన కమిషనర్, మహిళల సాధికారతలో వాటి పాత్రను ప్రశంసించారు.

## స్వీయ జనగణనలో పాల్గొనాలి

సిఎంసి కమిషనర్ సృజన

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రతిరోజూ ఒక వార్డు కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజున సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ సృజన శేరిలింగంపల్లి జోన్‌లోని పటాన్‌చెరు సర్కిల్ పరిధిలోని తెల్లాపూర్ వార్డును సందర్శించి క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. తెల్లాపూర్‌లోని 45 ఆర్‌డబ్ల్యూఏతో చర్చించి అభిప్రాయాలు సేకరించిన కమిషనర్, జనగణన స్వయం నమోదు ప్రక్రియలో ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులతో సమావేశమై పౌర సమస్యలను సమీక్షించారు. దెబ్బతిన్న రహదారులపై ప్రాధాన్యత క్రమంలో ప్యాచ్‌వర్క్ చేయాలని, వీధి దీపాల మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ క్రమం తప్పకుండా స్వీపింగ్, చెత్త తొలగింపు చేపట్టాలని సూచించారు. నీటి నిల్వ సమస్యలను ముందస్తుగా నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీ వ్యవస్థలోని



అడ్డంకులను తొలగించాలని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు పార్కింగ్ మార్కింగ్ చేపట్టాలని, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. నీటి సరఫరా సమస్యలను జలమండలితో సమన్వయం చేసి పరిష్కరించాలని సూచించారు. కీలక ప్రాంతాల్లో సిసిటివి కెమెరాల ఏర్పాటు, నిబంధనలు పాటించని ఆర్‌ఎంసి యూనిట్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



### సైబరాబాద్ వేసవి క్రీడా శిబిరాలు ప్రారంభం

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ఆధ్వర్యంలో మియాపూర్ పి.జె.ఆర్ స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు–2026 ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గాంధీ, సిఎంసి కమిషనర్ సృజన ప్రారంభించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, అదనపు కమిషనర్ (క్రీడలు) సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడా మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, నీరు ఎక్కువగా తాగాలని, మధ్యాహ్న వేళల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## జిహెచ్‌ఎంసి సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం






ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి సమ్మర్ కోచింగ్ క్యాంప్–2026 సికింద్రాబాద్ జోన్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ శిబిరం మొత్తం 37 రోజుల పాటు నిర్వహించనున్నారు. మొత్తం 752 మైదానాల్లో 44 రకాల క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. అంబర్‌పేట్ ప్లేగ్రౌండ్‌లో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ విప్, ఎంఎల్‌సి డాక్టర్ బి.వెంకట్‌నర్సింగ్‌రావు, ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, జోనల్ కమిషనర్ కె.ఏ.మంగతాయారు హాజరయ్యారు. అధికారులు, విద్యార్థులు, కోచ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**రాజేంద్రనగర్ జోన్‌లో ప్రారంభం..** జిహెచ్‌ఎంసి సమ్మర్ కోచింగ్ క్యాంప్ రాజేంద్రనగర్ జోన్‌లో ప్రారంభమైంది. కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడమే లక్ష్యంగా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## నాలా ఆక్రమణల తొలగింపు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం



ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసిలో పిపిపిపి కార్యక్రమం ఎనిమిదో వారం, 56వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఈరోజు నాలా ఆక్రమణల తొలగింపు, నాలాల పూడికతీత కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్, చార్మినార్, సికింద్రాబాద్ జోన్‌లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 3.8 కిలోమీటర్ల నాలాలను గుర్తించి శుభ్రపరిచే పనులు చేపట్టారు. ఈ చర్యల ద్వారా వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలను నివారించడంతో పాటు నగరంలో పారిశుధ్య పరిస్థితులను మెరుగుపరచడమే లక్ష్యంగా అధికారులు తెలిపారు.

## లీగల్‌గా పిల్లలను దత్తత తీసుకోవాలి

అదనపు కలెక్టర్ కిరణ్మయి కొమ్మిశెట్టి




ప్రజాపక్షం/రంగారెడ్డి: పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు తప్పనిసరిగా లీగల్ విధానంలోనే ప్రక్రియను చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి కొమ్మిశెట్టి సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న చైల్డ్ వెల్ఫేర్ వీక్ సందర్భంగా లీగల్ అడాప్షన్, ఇల్లీగల్ అమ్, ఫోస్టర్ కేర్ అంశాలపై అవగాహన కల్పించేందుకు కలెక్టరేట్ కార్యాలయంలోని సెమినార్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా సంక్షేమ అధికారి ఎల్.శ్రీలత, రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యూసి)సభ్యులు డాక్టర్ రమాదేవి, "వేర్ అర్ ఇండియాస్ చిల్డ్రన్ "అనే ఎన్‌జిఒకు చెందిన సంతోష్, ప్రేమలత, డిసిపిఒ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ సహజం

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు

ప్రజాపక్షం/రంగారెడ్డి: తుక్కుగూడ ఫ్యాబ్ సిటీ భవనంలో ఉన్న ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు, అదనపు డిసిపి సత్యనారాయణలకు పదవీ విరమణ సందర్భంగా "బిడ్ అద్యూ" (వీడ్కోలు) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖలో వారు అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ, సహచర అధికారులు,సిబ్బంది తమ అనుభవాలను, జ్ఞాపకాలను పంచుకున్నారు. ఏప్రిల్ 30తో పదవీ విరమణ పొందుతున్న జి సుధీర్ బాబు, సత్యనారాయణలకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వీడ్కోలు గ్రహీత, ఫ్యూచర్ సిటీ సిపి సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికీ పదవీ విరమణ సహజమని, పదవీ విరమణ పొందిన అధికారులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. తమ సేవల ద్వారా ప్రజలకు ఎంత మేలు చేశామన్నదే ముఖ్యమని, ఆ సేవల ఫలితాలు చిరస్థాయిగా నిలుస్తాయని తెలిపారు. కార్య



క్రమంలో ఫ్యూచర్ సిటీ జాయింట్ సిపి చందనా దీప్తి, మహేశ్వరం డిసిపి కె.నారాయణ రెడ్డి,చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతమ్, షాద్‌నగర్ డిసిపి సిరీష ,ట్రాఫిక్ డిసిపి శివమ్ ఉపాధ్యాయ,ఇబ్రహీంపట్నం ఏసిపి కెవిపి రాజు,ఇతర విభాగాల ఏసిపి లు హుస్సేన్ నాయుడు,అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## చెరువు కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు

ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖానామెట్ చెరువును కొంతమంది కబ్జాదారులు కూకట్‌పల్లి సర్వే నెంబర్ జతచేసి కబ్జాచేసి ఖానామెట్ చెరువు స్థలంలో అక్రమ నిర్మాణాలు చెపడుతున్నారని, హైడ్రా అధికారులు, సియంసి అధికారులు, మండల రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం ఖానామెట్ చెరువు స్థలాన్ని సందర్శించిన సిపిఐ రాష్ట్రనాయకులు పానుగంటి పర్వతాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైటెక్ సిటీ, సైబారాబాద్ ఐటి సంస్థలతో మాదాపూర్, ఖానామెట్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచడంతో ఇక్కడ భూములకు ఎకరా రూ.150 కోట్లకు పైగా ఉండడంతో ఖానామెట్‌లోని ప్రభుత్వ భూములు, చెరువులపై కొంతమంది బిల్డర్ల కన్నుపడి వాటికి దొంగపత్రాలను సృష్టిస్తూ కోట్ల రూపాయల ప్రభుత్వ అస్తులు కబ్జాలకు ప్రయత్నిస్తున్నారని, అయిన అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పేదలు గుడిసెలు వేసుకుంటే రాత్రికి రాత్రే




కూల్చే అధికారులు ధనవంతులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చెపడుతుంటే కండ్లు కనబడడం లేదా ప్రశ్నించారు. హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే అక్రమ కబ్జాదారులపై కొరడా ఝులిపించి కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న స్థలాన్ని ప్రభుత్వ అధీనంలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రామకృష్ణ, సిపిఐ శేరిలింగంపల్లి కార్యదర్శి చందుయాదవ్, జిల్లా సమితి సభ్యులు వెంకటస్వామి, తుపాకుల రాములు, ఖాసీం, వెంకటేష్, జెట్టి శ్రీనివాస్, తిరుపతయ్య, కిరణ్, బాలస్వామి, అజయ్ పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో పోలీసుల సేవలు వెలకట్టలేనివి

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్

ప్రజాపక్షం/రంగారెడ్డి: విధి నిర్వహణలో పోలీసుల సేవలు వెలకట్టలేనివి అని సైబరాబాద్ పోలీస్‌కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. గురువారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఏడుగురు పోలీసు సిబ్బందిని సిపి డాక్టర్ ఎం.రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పత్రాలు అందజేసి, పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి టి.అన్నపూర్ణ, డిసిపి క్రైమ్స్ ముత్యంరెడ్డి, డిసిపి స్పెషల్ బ్రాంచ్ వై.వి.ఎస్.సుధీంద్ర, సైబర్ క్రైమ్స్ డిసిపి టి.సాయి మనోహర్, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డిసిపి సృజన కర్ణం, ఎస్‌బి ఏడిసిపి రవికుమార్‌తో పాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.



## నేడు జవహర్ నగర్‌లో ఘనంగా 140వ మేడే ఉత్సవాలు

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని, మే 1వ తేదీ శుక్రవారం జవహర్ నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 140వ మేడే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారని జవహర్ నగర్ భవనిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్ తెలిపారు. ఉదయం 8:00 గంటలకు స్థానిక విఆర్‌వో ఆఫీస్ ఎదురుగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, ప్రముఖ ప్రజా నాయకులు, కళాకారులు ప్రభుత్వ న్యాయవాదులు పాల్గొంటారని. జెండా ఆవిష్కరణ అనంతరం కార్మికుల హక్కుల కోసం భారీ సభ మెయిన్ రోడ్డుపై ర్యాలీ నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా ప్రధానంగా ఈ క్రింది డిమాండ్లపై చర్చించనున్నారు. 1. లేబర్ అడ్డా స్థలం: కార్మికులు వేచి ఉండటానికి శాశ్వత అడ్డా స్థలం కేటాయింపు. 2. కూలీ రేట్లు: ప్రస్తుత ధరలకు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికుల కూలీ రేట్ల సవరణ, 3.కార్మిక హక్కులు: ప్రభుత్వం నుండి అందాల్సిన సంక్షేమ పథకాలు భద్రతపై అవగాహన కార్మికులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలి. రేపు జరిగే ఈ మేడే వేడుకలకు, ర్యాలీకి భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని, భవన నిర్మాణ కార్మిక సంఘం జవహర్ నగర్ ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్ ఒక ప్రకటనలోతెలిపారు.



## పెండింగ్ పనులు పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** పెండింగ్‌లో ఉన్న పనులకు త్వరితగతిన పూర్తి చేయాలని ఘట్కేసర్ సర్కిల్ డిసి వాణికి వినతి పత్రం సమర్పించారు.గురువారం ఘట్కేసర్ సర్కిల్ కార్యాలయంలో డిసిని నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వంగా కలిసి డివిజన్‌లో ఆన్ ప్రొగ్రెస్‌లో ఉన్న 25 కోట్ల రూపాయల పనులను త్వరితగతి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి,సురేస్,ప్రవీణ్,వేణుగోపాల్‌రావు తదితరు లు పాల్గొన్నారు.



## ఐజికె కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజికె కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా నివసిస్తున్న కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పైకప్పులు లీకేజీ , డ్రైనేజీ, భవనాల స్లాబు పెచ్చులు ఊడిపోవడం జరుగుతుందని కాలనీవాసులు తెలుపడంతో ఎమ్మెల్యే గత కొన్ని రోజుల క్రితం అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు.సమస్యలు దృష్టిలో పెట్లుకుని అధికారులతో ఎమ్మెల్యే కాలనీలో పర్యటించి సమస్యలు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



## ఐమాస్ లైట్లకు, బోర్‌వెల్‌కు మార్కింగ్

**ప్రజాపక్షం/దుండిగల్ :** బౌరంపేట్ డివిజన్ సింహపురి కాలనీ సమస్యలపై కాలనీ వాసులు సర్కిల్ బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి పర్యటించారు. గత నెల కాలనీ వాసులతో కలిసి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేసిన వెంటనే, ప్రధాన సమస్య అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఐమాస్ లైట్లు మరియు బోర్‌వెల్ మంజూరు కు ఆదేశించారు ఈ సందర్భంగా ఎంపి లాడ్స్ నిధులతో 2 ఐ మాస్ పోల్స్, ఒక బోర్‌వెల్ కు కాలనీ వాసులతో కలిసి మార్కింగ్ చేశారు. కాలనీకి కొత్త వెలుగులు ప్రసాదించినందుకు ఎంపి ఈటల రాజేందర్ కు బిజెపి అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు కాలనీ లోని ఓపెన్ టు స్పెస్, పార్క్ స్థలాల అక్రమ కబ్జాలు అధికారులు తొలగించడంతో ఆ యొక్క స్థలాలను సందర్శించి వాటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి అధికారుల ఆధీనంలో తీసుకోని ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోశాధికారి కొమ్ము ప్రశాంత్ స్థానిక వాసులు నల్ల రాజిరెడ్డి, పరికి ప్రమోద్ కుమార్, సాయి కిరణ్, శివ, నరేందర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ జ్యుడీషియల్ సర్వీస్ ఏర్పాటు పిటిషన్‌పై...
## కేంద్రం, లా కమిషన్, ఇతరులకు 'సుప్రీం' నోటీసులు

**న్యూఢిల్లీ :** రెవెన్యూ జ్యుడీషియల్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని, భూ వివాదాలను పరిష్కరించే ప్రభుత్వ ఉద్యోగులకు కనీస న్యాయ అర్హత, శిక్షణా విధానాన్ని నిర్దేశించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం(పిల్)పై గురువారం సుప్రీంకోర్టు కేంద్రం, ఇతరుల నుంచి స్పందన కోరింది. భూ వివాదాలను అర్హతలేని న్యాయ నిపుణులు పరిష్కరిస్తున్నారని ఆరోపిస్తూ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, లా కమిషన్, ఇతరులకు నోటీసులు జారీచేసింది. దాదాపు 66శాతం సివిల్ కేసులు భూవివాదాలకు సంబంధించినవేనని, అధికారిక న్యాయవిద్య, శిక్షణలేని అధికారులు ఈ కేసుల్ని విచారిస్తున్నందువల్ల తప్పుడు, అస్థిరమైన తీర్పులు వెలువడటమే ఇక్కడి ప్రధాన లోపమని పిటిషనర్ పేర్కొన్నారు. న్యాయవాది అశ్వినీ దూబే రూపొందించిన పిటిషన్‌లో ఈ అంశాన్ని అలహాబాద్ హైకోర్టు పరిష్కరించినప్పటికీ దాని ఆదేశం ఇప్పటివరకూ అక్షరాలా అమలుకు నోచుకోలేదని పిటిషనర్ తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థ భూవివాదాల పరిష్కారాన్ని న్యాయ నేపథ్యంలేని రెవెన్యూ అధికారులకు అప్పగించడం ద్వారా పౌరులకు నిరంతర నష్టాన్ని కలిగిస్తోందని, దీని ఫలితంగా ఏకపక్ష, అస్థిరమైన, దోషపూరిత నిర్ణయాలు వెలువడుతున్నాయని, దీనివల్ల ఆస్తి హక్కులపై దీర్ఘకాలిక అనిశ్చితి ఏర్పడి, భూవినియోగం బదిలీపై ఆంక్షలు విధించబడి, వ్యాజ్యాలు, ఖర్చులు పెరిగి, న్యాయం పొందేందుకు సమర్థవంతమైన అవకాశం లేకుండా పోతోందని, తద్వారా రాజ్యాంగంలోని 14, 21 ఆర్టికల్స్ కింద హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కులను ఇది ఉల్లంఘిస్తున్నదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# పిల్లల చట్టబద్ధ దత్తత కోసం 'హెల్ప్‌డెస్క్'

### కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** పిల్లలను అధికారికంగా దత్తత తీసుకొనే ప్రక్రియ సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేస్తున్న అడాప్షన్ హెల్ప్ సెంటర్ ద్వారా అవసరమైన సమగ్ర సమాచారాన్ని తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. చట్ట ప్రకారమే దత్తతలు తీసుకోవాల్సి ఉంటుందని, అక్రమ దత్తతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాయమన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆయన గురువారం హెల్ప్‌డెస్క్‌ను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ఇకపై ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి రోజున దత్తత విషయమై అధికారులు, సిబ్బంది సాయం చేస్తారన్నారు. దత్తతలో అంతర్జాతీయ దత్తత, విదేశీ దత్తత, బంధువుల నుండి తీసుకొనే దత్తతలాంటి పలు రకాలు ఉన్నాయన్నారు. ఈ విషయంలో దత్తత తీసుకొనే దంపతులు నిబంధన నియమాలు తెలుసుకోవాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ ఆస్పత్రుల్లో కానీ నర్సింగ్ హోమ్స్‌లలో కానీ దత్తత తీసుకోవటం నిబంధనలకు వ్యతిరేకమన్నారు. దత్తత ప్రక్రియ కోసం www.missionvastalya.wvd.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియజ్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు శిక్షణలో భాగంగా స్పాన్సర్షిప్, పిల్లల దత్తత అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. అక్రమంగా దత్తత తీసుకొంటే అట్టి సమాచారాన్ని 1098 ద్వారా సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. పోస్టర్ కేర్ ప్రతి ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి కుటుంబాలతో మాట్లాడి దత్తతపై ఉన్న అపోహలు తొలగిస్తూ చట్టబద్దంగా దత్తత తీసుకొనేందుకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా అనాథ పిల్లల సంరక్షణ దత్తత ప్రక్రియ అవగాహన కోసం జిల్లా ఆరోగ్య విభాగం కీలక చర్యలు తీసుకోవాలన్నారు.



**డీజిల్, పెట్రోల్ కొరత లేదు- భయాందోళనలు వద్దు**

జిల్లాలో ఎలాంటి డీజిల్, పెట్రోల్ కొరత లేదని, ఈ విషయంలో వస్తున్న సోషల్ మీడియా దుష్ప్రచాలను చూసి వాహనదారులు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. గురువారం ఆయన శామీర్‌పేట మండలంలోని తూంకుంట ప్రాంతంలో ఉన్న పెట్రోల్ పంపును తనిఖీ చేసారు. నిర్వాహకుల రికార్డులను పరిశీలిస్తూ ఏ మేరకు స్టాక్ అందుబాటులో ఉందన్న విషయాలపై ఆరా తీసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పెట్రోల్ పంపుల్లోనూ అవసరమైన మేరకు డీజిల్, పెట్రోల్ నిల్వలు ఉన్నాయన్నారు. ఈ విషయంలో వాహనదారులు ఆందోళనకు గురికావద్దన్నారు. పెట్రోల్ పంపు యజమానులు ఎప్పటికప్పుడు తమకు అవసరమైన మేరకు డీజిల్, పెట్రోల్ స్టాక్‌ను ఆయిల్ సంస్థల నుండి తెప్పించుకోవాలని సూచించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనివాసరెడ్డి ఆయన వెంట ఉన్నారు. .



## పదిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ




**ప్రజాపక్షం/చర్లపల్లి:** పదవ తరగతిలో నాగారం స్కూల్ విద్యార్థులు 30 సంవత్సరాలలో కీసర మండలంలో ఉత్తమ ప్రతిభను కనబర్చారని మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.ఎస్ఎస్‌సి ఫలితాల్లో కీరస మండలంలోనే మొదటి స్థానంలో ప్రణీత్ 569,రెండం స్థానంలో నిహరిక 559 మార్కులు సాధించిన నాగారం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఘనత సాధించారు.ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రతి నెల చంద్రారెడ్డి ఔదార్యం చూయించి ఇద్దరు వాలీంటర్లకు 10 వేల చొప్పున చెల్లిస్తున్నారని వారికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాములు,ఉపాధ్యాయులు ,నక్క కిషోర్ గౌడ్,రాజుగౌడ్,కిషోర్‌చారి,రవీందర్‌రెడ్డి,రాకేష్‌గౌడ్,రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

## '99 రోజుల ప్రజాపాలన'లో పట్టణ స్థాయిలో సభ ఏర్పాటు

### అధికారులకు కలెక్టర్ దీపక్‌తివారీ ఆదేశం




**ప్రజాపక్షం/వికారాబాద్:**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల భాగంగా మున్సిపల్ పరిధిలో పట్టణ స్థాయిలో సభలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫిరేన్స్‌లో అన్ని మండల ఎంపిడిఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ పరిదిలో ఉన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారులను నియమించాలనీ , మున్సిపల్ అధికారులు సమన్వయంలో పనిచేసి ప్రోగ్రాంను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఇందులో ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్లు రైతు భరోసా, మహలక్ష్మి, జీవితబీమా పథకం కల్యాణ లక్ష్మి షాదీముబరక్ వంటి పథకాలను ప్రజలకు అందుతున్నాయని తెలుసుకోవాలని ఆదేశించా రు.

**పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశం:** ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ ఇండ్ల పురోగతిపై 99 రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలనలో హౌసింగ్, సిసి రోడ్లు ,ఎస్ఎస్‌జీ , బిల్డింగ్, స్కూల్స్ కౌంపౌండ్ వాల్స్ అంగన్వాడి ,పిఎచ్‌సి ,గోదంల నిర్మాణంపై అధికారులతో సమిక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి మండలానికి ఇచ్చిన లక్ష్యలను పూర్తి చేయాలని ఆదేశించారు.

**ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి :** వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ నింబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ దీపక్‌తివారి అధికారులను అదేశించారు. కలెక్టర్ మాట్లాడూతూ రైతులు ధాన్యాన్ని తీసుకు వచ్చే సమయంలో నిబంధనల ప్రకారం మట్టి గుడ్డల తప్ప,తేమ ఇతర నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ,రైతుల సౌకర్యార్థం త్రాగు నీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి కసరు ఇతర సదుపాయలు కల్పించాలనిఅదేశించారు. రైతులు నాణ్యతప్రమాణాలకు లోబడి ధాన్యా న్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు.

**కార్మికదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి:** మే 1వ తేదీన కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక సందర్భంగా జిల్లా కార్మిక శాఖ అధ్వర్యంలో మే1 ఉదయం 10గంటలకు అధికారులు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.వివిధ కార్యక్రమాలను ప్రజలు కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, డిఆర్‌డిఓ,శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నా రు.

### నేపాల్‌లో రోడ్డు ప్రమాదం
## 17 మంది హిందూ యాత్రికులు మృతి

**కాఠ్మండు:**నేపాల్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 17 మంది హిందూ యాత్రికులు మరణించారు. థవాంగ్ రూరల్ మున్సిపాలిటీ రోల్పాలో ఈ ప్రమాద ఘటన జరిగింది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ సునీల్ థాపా నేపాలీ చెప్పిన సమాచారం ప్రకారం, ప్రమాదం కారణంగా హిందూ యాత్రికులు ప్రయాణం చేస్తున్న జీపు 800 మీటర్ల లోతున పెద్ద గోతిలో పడిపోయింది.జల్‌జలాలో ఉన్న ఒక ప్రముఖ హిందూ దేవాలయాన్ని సందర్శించేందుకు రుకుంకోట్ నుండి యాత్రికులు వెళుతుండగా రోల్పా వద్ద ఈ దుర్ఘటన జరిగింది.

రుకుంకోట్ జిల్లా ప్రధానాధికారి గంగాబహదూర్ ఛత్రి మాట్లాడుతూ, ఈ ఘటన జరిగిన వెంటనే స్థానిక ప్రజలు,పోలీసులు వెళ్ళి వారిని వెలికితీసి ఆసుపత్రులకు తరలించారని చెప్పారు. మే ఒకటో తేదీన వైశాఖపౌర్ణమి సందర్భంగా జల్‌జలాలోని హిందూ ఆలయంలో పూజలు చేసేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.



## ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం /వికారాబాద్ రూరల్ :** వికారాబాద్ మండల పరిధిలోని బురంతపల్లి గ్రామ పంచాయతీలోని కొనింటి అనుసుజ, కావలి అండల ,సర్పంచు రాందాస్‌నాయక్ కలిసి స్పీకర్ ప్రసాద్ కుమార్ ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. అనంతరం ధారూర్ మండల పరిదిలోని గురుదోట్ల , కుక్కింద గ్రామల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభోత్సవం చేసి లబ్దిదాలరులో గృహ ప్రవేశలు చేయించారు. ఇళ్ల యజమానులకు శుభాకంక్షలు తెలపి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ శ్రీనివా స్ ముదిరాజు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, అధికారులు పాల్గొ న్నారు.



## మంచినీటి సమస్యను పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌కు వినతి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని పోచారం, నాగారం, ఘట్‌కేసర్, ఎదులాబాద్‌లోని నివసిస్తున్న ప్రజలకు మంచినీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది ఈసమస్యపై అన్ని పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, వేముల సంజీవ గౌడ్, పన్నాల కొండల్ రెడ్డిలు గురువారం ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. జోనల్ కమిషనర్‌తో పాటు ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డికి ఇలాంటి కీలక సమయంలో ప్రస్తుతం విధుల్లో ఉన్న వాటర్ మెన్లను బదిలీ చేయడం కొత్త వారితో మంచినీటి సరఫరా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు.వాటర్ మెన్ల బదిలీ ఉత్తర్వులను రద్దు చేయాలని లేకుంటే ప్రజలకు మరింత ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్ బేతాల నర్సింగ్ రావు,మేకల నర్సింగ్ రావు,బురుగు చంద్రశేఖర్ గుప్తా, శ్రీరాములు, రవీందర్, మేదరి సురేష్ కుమార్డ్ తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీ కొన్న కారు : వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/వికారాబాద్:** మున్సిపల్ పరిధిలోని కొత్తగడి దగ్గర రాత్రి 12గంటలకు ఇన్నోవా వెహికల్ నెంబర్ 28.ఆర్1000 గల కారు హైదరాబాద్ నుండి వికారాబాద్ కి వస్తుండగా వికారాబాద్ కు వస్తున్నడగా వివైడర్‌ను బలంగా గుద్దడంతో అందులో ప్రయణిస్తున్నటువంటినలుగురు వ్యక్తులు కలిమోద్దీన్ , అక్బర్దీన్, నాసిర్‌హుషన్, కలిమోద్దీన్‌కి చెస్ట్‌దగ్గర బలమైన దెబ్బలు తగలడం తో ఆసుపత్రికి తరలించడం జరిగింది. మార్గమధ్యలో మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. నిర్లక్ష్యంగా నడిపిన కలిమోద్దీన్ మృతికి కారణమైన వ్యక్తిపైన కేసునమోదు చేసుకోని దర్యాప్తు చేయడం జరుగుతుందని సిఐ రఘుకుమార్ తెలిపారు. ఇట్టి ప్రమాద స్థలాన్ని అర్‌అండ్‌బి ఇఇ,మున్సిపల్ కమిషనర్ లతో కలసి ప్రమాదకారణాలు అధ్యయనం చేసి అక్కడ మళ్లీ ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకుంటామన్నారు.



## కేంద్ర గ్రంథాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవటం ద్వారా తమ లక్ష్యాలను చేరుకోవటంతో పాటు చరిత్ర, ప్రస్తుత సమాజ మార్పులు, అభివృద్ధి పట్ల సమగ్ర అవగాహన ఏర్పడుతుందని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. గురువారం ఆయన జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఎం నాగవేణితో కల్సి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ పరిసరాలను పచ్చ దనంతో నింపేలా చూడటంతో పాటు చదువరుల కోసం నాలుగు కూలర్లను ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రంథాలయ అభివృద్ధి కోసం తాను ఇక నుండి స్వయంగా పర్యవేక్షిపస్తూ సహకరిస్తానన్నారు.

# దర్జాగా బైన్(పెద్ద) చెరువు కబ్జా!

* తేల్చేసిన మండల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు.
* ఎఫ్‌టిఎల్ లో ఇరవై, బఫర్ జోన్‌లో అరవై నిర్మాణాల గుర్తింపు
* ఐదున్నర ఎకరాల చెరువు స్థలంలో నిర్మాణాలు
* రేపో, మాపో చర్యలకు సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** బాచుపల్లి బైన్ (పెద్ద) చెరువు బాజాప్తగా కబ్జాకు గురైంది. ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో పదుల సంఖ్యలో పక్కా భవనాలు, తాత్కాలిక గుడిసెలు ఉన్నట్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తేల్చేశారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బాచుపల్లి మండలంలోని బాచుపల్లి గ్రామం పెద్ద (బైన్) చెరువు సర్వేనంబరు 64లో 42.28 ఎకరాలు ఉండగా సర్వేనంబరు 7 లోని పట్టా భూమిలో 5.28 ఎకరాల స్థలంలో చెరువు విస్తరించి ఉంది. పూర్వం నుండి ఈ చెరువుని గ్రామస్థులు అన్ని రకాలుగా వాడుకునే వారని స్థానికులు చెబుతున్నారు.

మత్స్యకారులు చేపలను సైతం పెంచుతూ వారి కుటుంబాల జీవనోపాధికి ఆధారంగా ఈ బైన్ చెరువు ఉపయోగపడుతుంది. రోజురోజుకి బైన్ చెరువు కుచించుకుపోవడం ప్రారంభమైంది. ఈ చెరువు చుట్టూ విల్లాలు, అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు ఏర్పడడంతో చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో సైతం నిర్మాణాలు వెలుస్తున్నాయి. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోనే కాకుండా బఫర్ జోన్‌ని వదిలేసి ముప్పై మీటర్ల వరకు స్థలాన్ని వదిలేయాలి. అట్టి స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు.



కాగా 2020 సంవత్సరంలోనే ఐదంతస్థుల భవనాలు వెలిశాయని ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. బైన్ చెరువు ఎఫ్‌టిఎల్‌లో 1.30 ఎకరాల్లో దాదాపు ఇరవై పక్కా భవనాలు, యాభై తాత్కాలిక గుడిసెలు ఉన్నాయని, చెరువు బఫర్ జోన్ 3.35 ఎకరాల్లో సుమారు అరవై నిర్మాణాలు వెలిశాయని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. బైన్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో వెలసిన భవనాలకు, షెడ్లకు నిజాంపేట్ సర్కిల్ అధికారులు అనుమతులను రద్దుచేయాలని రెవెన్యూ అధికారులు నివేదికను పంపారు. బాచుపల్లిలోని పెద్ద (బైన్) చెరువు రోజురోజుకి కబ్జాకు గురవుతుండడంతో రెవె న్యూ, ఇరిగేషన్ అధికారులు ఇప్పటికే ఆక్రమణలను గుర్తించి జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓలకు నివేదించారు. ఆక్రమణలను ఇలాగే వదిలేస్తే రాబోవు రోజుల్లో చెరువు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే చెరువుపై ఆధార పడి చేపలను పెంచుకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారే అవకాశాలు లేకపోలేదు. అంతేకాకుండా బాచుపల్లి చెరువు కనుమరుగైతే భూ గర్భ జలాలకు సైతం ముంపు వాటిల్లే ప్రమాదం నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాచుపల్లి బైన్ చెరువు ఆక్రమణలను తొలగించి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**బైన్ చెరువు కబ్జాలపై ఉన్నతాధికారులకు నివేదించాం, చర్యలు తీసుకుంటాం: బాచుపల్లి మండల తహసీల్దార్ వాణిరెడ్డి**

బాచుపల్లి బైన్ చెరువు ఆక్రమణల పై ఉన్నతాధికారులకు నివేదించామని చర్య లు తప్పనిసరిగా తీసుకుంటామని బాచుపల్లి మండల తహశీల్దార్ వాణిరెడ్డి తెలిపారు. బాచుపల్లి బైన్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లలో నిర్మాణాలు పదుల సంఖ్యలో ఉన్నాయని, ఇరిగేషన్, రెవెన్యూ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో నిర్మాణాలను గుర్తించామని, నిజాంపేట్ సర్కిల్ అధికారులు నిర్మాణాలకు జారీ చేసిన అనుమతులను సైతం రద్దు చేయాలని చెపినట్లు వాణిరెడ్డి వివరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెరువు ఆక్రమణలపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

## అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి: సత్యనారాయణ




**ప్రజాపక్షం/చాంద్రయణగుట్ట:** అన్ని విభాగాల అధికారులు బాధ్యతగా విధులు నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని చార్మినార్ జెడ్‌సి కే.సత్యనారాయణ అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు జెడ్‌సి కార్యాలయంలో గురువారం ఆయన ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, మలేరియా, ఎలక్ట్రికల్, వీధి దీపాలు, యూసీడీ తదితర విభాగాల అధికారులతో వేరువేరుగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో జోనల్ ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ ఇందిర, ఈఈ సన్నావుద్దీన్, యాదగిరి, మాధవి, మలేరియా విభాగం ఎస్‌ఈ శ్రీనివాస్, శానిటేషన్ డిఇలు వెంకట్‌రాజు, నవీన్ కుమార్, రంజిత్ కుమార్‌రెడ్డి, శ్రీరాములు, ఎలక్ట్రికల్ డిఇ సత్యనారాయణరెడ్డి, యూసీడీ డిసిఒ రత్నమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నరసింహుడికి పూజలు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సర వైశాఖ మాసం, శుద్ధ చతుర్దశి, స్వాతి నక్షత్రం నారసింహ జయంతి(నారసింహ స్వామి అవతార దినోత్సవం) సందర్భంగా గురువారం ఖైరతాబాద్ నెహ్రూ నగర్‌లోని బండ నరసింహస్వామి దేవాలయంలో నరసింహ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ విజయరెడ్డి మొక్కలు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## 15 రోజుల్లో ఫార్మసిస్ట్ లిస్ట్ విడుదల చేయాలి



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** ఫార్మసిస్ట్ లిస్ట్ 15 రోజుల్లో విడుదల చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు కోఠిలోని డిఎంఇ కార్యాలయం వద్ద సెలక్షన్ లిస్ట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఫార్మసిస్ట్ అభ్యర్థులు చేపట్టిన ఆందోళనకు ఆర్.కృష్ణయ్య మద్దతు తెలిపారు. అభ్యర్థులను అడ్డుకున్న పోలీసులతో ఆయన వాగ్వివాదానికి దిగి, అనంతరం మెడికల్ బోర్డ్ సభ్యుడు గోపికాంత్‌రెడ్డిని కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. 732 ఫార్మసిస్ట్ పోస్టులకు 24 వేల మంది పోటీ పడితే, కోర్టు కేసుల సాకుతో నాలుగు నెలలుగా అధికారులు జాప్యం చేయడం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని విమర్శించారు. రాబోయే 15 రోజుల్లోగా సెలక్షన్ లిస్ట్ విడుదల చేయకపోతే వేలాది మంది నిరుద్యోగులతో కలిసి డీఎంఈ కార్యాలయాన్ని దిగ్బంధిస్తామని ఆర్. కృష్ణయ్య అధికారులను హెచ్చరించారు.

## ప్రపంచ నాట్య దినోత్సవ వేడుకలు




**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** కథక్ కళా క్షేత్ర డైరెక్టర్ నాట్య గురు అంజిబాబు ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో 30వ ప్రపంచ నాట్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ సాంప్రదాయ నృత్యాలను బాలలు ప్రదర్శించారు. బాలల ప్రదర్శన సమ్మోహనంగా సాగాంది. ఈ సందర్భంగా బాలాలకు సర్టిఫికెట్స్ అందజేశారు.

## ఆకట్టుకున్న సాంప్రదాయ నృత్యాలు



**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ:** విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డాన్స్ డే నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు విజయ మాధవి, విధి సాయిజ సారథ్యంలో జరిగిన వేడుకల్లో అను ప్రసాద్, రాజేంద్ర, కోనే హరిహరన్, వినోద్ కుమార్‌తో పాటు పలువురు నాట్యగురువులు అతిథులుగా హాజరయ్యారు. తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మిమిక్రీ ఆర్టిస్ట్ రమేష్ చారి, డాక్టర్ పి ఝాన్సీ, డాక్టర్ హైమావతి, సుష్మ, ప్రీతి, పరవస్తు హర్షిత, రశ్మిత, స్వాతి, చిత్తూరి తదితర పది మంది నాట్య గురువుల శిష్య బృందం ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు విశేషంగా అలరించాయి.

## మంత్రి అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/జూబ్లీ-హిల్స్:** ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి అజహారుద్దీన్‌ను మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో కిషోర్, రూప తదితరులు ఉన్నారు.

# మానవత్వమే గొప్ప వైద్యం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

### డాక్టర్ గాయత్రి పాలట్‌కు యుధ్‌వీర్ మెమోరియల్ అవార్డు ప్రదానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మానవతా దృక్పథంతో సమాజ సేవ చేసే వారిని గుర్తించి గౌరవించడం ద్వారా ఇతరులకు స్ఫూర్తి కలుగుతుందని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. వైద్య రంగంలో, పాలియేటివ్ కేర్ (ఉపశమన చికిత్స) విభాగంలో నిరుపమాన సేవలు అందిస్తున్న ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ గాయత్రి పాలట్‌కు ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకమైన 'యుధ్‌వీర్ మెమోరియల్ అవార్డు' లభించింది. హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని ఎఫ్‌టిసిసిఐ ఆడిటోరియంలో జరిగిన యుధ్‌వీర్ ఫౌండేషన్ 33వ వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో ఆమెను ఘనంగా సత్కరించారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి, డాక్టర్ గాయత్రికి అవార్డుతో పాటు రూ. ఒక లక్ష రూపాయలు నగదు బహుమతిని, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అవార్డు ప్రదానం అనంతరం గవర్నర్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, జర్నలిస్ట్ దివంగత యుధ్‌వీర్ ఆశయాలను ఫౌండేషన్ కొనసాగించడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. 33వ యుధ్‌వీర్ మెమోరియల్ అవార్డును డాక్టర్ గాయత్రి పలట్‌కి అందించడం తనకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. వైద్యం అంటే కేవలం మందులు ఇవ్వడం మాత్రమే కాదు, రోగి పట్ల మానవత్వంతో వ్యవహరించడం అని డాక్టర్ గాయత్రి నిరూపించారన్నారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడేవారికి నొప్పి తెలియకుండా, గౌరవప్రదమైన జీవితాన్ని అందించడంలో ఆమె కృషి అద్భుతమైనదని అభినందించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, నిరుపేదలకు పాలియేటివ్ కేర్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఆమె నాయకత్వం ప్రశంసనీయమన్నారు. మన దేశంలో ఇటువంటి సేవలు ఇంకా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ గాయత్రి వంటి వారు సమాజానికి స్ఫూర్తిదాయకమని అభినందించారు. ఆమె చేస్తున్న ఈ నిరంతర సేవలకు గాను ఈ అవార్డు దక్కడం ఎంతైనా సమంజసమన్నారు.

**ఇది సమష్టి కృషికి దక్కిన గుర్తింపు : డాక్టర్ గాయత్రి పాలట్**

అవార్డు గ్రహీత డాక్టర్ గాయత్రి పాలట్ మాట్లాడుతూ ఈ గౌరవం తన ఒక్కరిదే కాదని, పాలియేటివ్ కేర్ విభాగంలో నిరంతరం శ్రమిస్తున్న వారందరిదని అన్నారు. క్యాన్సర్ వంటి నయం చేయలేని వ్యాధులతో బాధపడేవారి శారీరక నొప్పిని తగ్గించడమే కాకుండా, వారి మానసిక, సామాజిక అవసరాలను తీర్చడమే ఈ చికిత్స ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రోగికి చివరి దశలో వేదన లేని, గౌరవప్రదమైన జీవితాన్ని అందించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని ఆమె ఆకాంక్షించారు. ఎంఎన్‌జె క్యాన్సర్ ఆసుపత్రిలో పాలియేటివ్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయడంలో పడిన కృషిని గుర్తు చేసుకున్నారు. సమాజంలో పాలియేటివ్ కేర్ పట్ల అవగాహన పెరగాలని, ప్రతి రోగికి ఈ రకమైన మద్దతు లభించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ సేవలను విస్తరించాల్సిన అవసరం ఉందని ఆమే అన్నారు. ఈ కార్యక్రమంలో యుధ్‌వీర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ అరుణబహుగుణ, ఫౌండేషన్ సభ్యులు అమీర్ అలీఖాన్, నరేంద్రరాయ్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణనలోనే బిసిల భవిష్యత్తు...
## ప్రతిఒక్కరూ సెల్ఫ్ ఎన్యూమరేషన్‌లో పాల్గొనాలి

### బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** జనగణనలో బిసిల భవిష్యత్తు దాగి ఉన్నదని బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం అన్నారు. ప్రతి ఒక్క బిసి బిడ్డ, ఇతర వర్గాలు బాధ్యతగా తీసుకొని సెల్ఫ్ ఎన్యూమరేషన్‌లో పాల్గొనాలని కోరారు. ఇందుకు ప్రభుత్వం తక్షణ చర్యగా గ్రామాల్లో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసిల వాస్తవ పరిస్థితులు ప్రభుత్వానికి తెలియాలంటే కచ్చితమైన డాటా తప్పనిసరి అన్నారు. ఇది కేవలం ఆన్‌లైన్ నమోదు కాదని, భవిష్యత్తు విధానాల బేస్ అని పేర్కొన్నారు. కులగణనలో చిన్న తప్పిదం కూడా రిజర్వేషన్లు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. బిసి సంఘం నేత విజిఆర్ నారగోని మాట్లాడుతూ జనగణనలో సేకరించే సమాచారం భవిష్యత్తు అభివృద్ధి, దిశను నిర్ణయిస్తున్నదన్నారు. తప్పు డేటా ఆధారంగా తీసుకొనే నిర్ణయాలు సమాజానికి నష్టం చేస్తాయన్నారు. కత్తి వెంకట స్వామి మాట్లాడుతూ జనగణనలో భాగంగా ప్రజలు ఈ నెల 11లోపు https:se.census.gov.in ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలని, హెల్ప్‌లైన్ 1855 కూడా అందుబాటులో ఉన్నదని సూచించారు. సమావేశంలో దక్షిణ భాతర ఒబిసి ఇన్‌చార్జి సూర్యనారాయణ, అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు రాములు యాదవ్, సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డా.రాజానారాయణ, మట్ట జయంతిగౌడ్, పుష్పలీల గౌడ్ , శివ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు క్లిష్ట శస్త్రచికిత్సలు విజయవంతం



### చిరంజీవి హాస్పిటల్ సిఇఒ డాక్టర్ సంజీవరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అత్యంత అరుదైన, క్లిష్టమైన రెండు శస్త్ర చికిత్సలను కూకట్‌పల్లి చిరంజీవి హాస్పిటల్ వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసినట్టు హాస్పిటల్ సిఇఒ, వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ సంజీవరావు వెల్లడించారు. హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వైద్య బృందంతో కలిసి మీడియాతో మాట్లాడారు. గత మూడు నెలలుగా తీవ్రమైన కడుపు నొప్పితో హాస్పిటల్‌కు వచ్చిన రాజమండ్రికి చెందిన కనకదుర్గ (50) అనే మహిళకు లివర్‌లో సుమారు 5 సెం.మీ పొడవైన చేప ముల్లు ఇరుక్కుపోయి ఉన్నట్టు స్కానింగ్‌లో తేలిందన్నారు. ఈ ముల్లు పేగుల నుంచి లివర్‌లోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్‌కు దారితీసిందన్నారు. వెంటనే శస్త్రచికిత్స చేసి ముల్లును తొలగించినట్టు తెలిపారు. మరో కేసులో 80 ఏళ్ల వృద్ధుడి కాలిలో రక్తప్రసరణ ఆగిపోవడంతో పాటు ప్రోస్టేట్ గ్రంథి సమస్యతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, ఈ నేపథ్యంలో అత్యాధునిక రివాస్కులరైజేషన్ విత్ యాంజియోప్లాస్టీ అండ్ ఐవిఎల్ చేసి కాలు కాపాడినట్టు తెలిపారు. వృద్ధుడికి ఉన్న ప్రోస్టేట్ సమస్యకు ప్రోస్టేట్ ఆర్టరీ ఎంబోలైజేషన్(పిఎఈ) ద్వారా సమస్యను సరిచేశామని తెలిపారు. సమావేశంలో వైద్య బృందం డాక్టర్‌అనిల్, డాక్టర్ భార్గవ్, డాక్టర్ లీనా, డాక్టర్ తైబా, డాక్టర్ శిల్ప, సుందర్ సింగ్ పాల్గొన్నారు.

## డాక్టర్ స్వామికి శ్రమశక్తి అవార్డు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మే డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రదానం చేసే ప్రతిష్ఠాత్మక శ్రమశక్తి అవార్డుకు సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చిలుకు స్వామి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం షారాజిపేట గ్రామానికి చెందిన చిలుకు స్వామి, ఒకవైపు రైల్వే ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే, మరోవైపు సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటున్నారు. గ్రామాల్లో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, శ్రమదానం కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో చైతన్యం తీసుకొస్తున్నారు. సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వ కార్మిక శాఖ, మే డే సందర్భంగా ఆయనను శ్రమశక్తి అవార్డుకు ఎంపిక చేసింది. ఈ గౌరవం దక్కడంపై రైల్వే ఉద్యోగులు, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హైదరాబాద్‌లో 'ఇవానా జువెల్స్' ప్రారంభం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నవతరం ల్యాబ్‌గ్రోన్ డైమండ్ బ్రాండ్ 'ఇవానా జువెల్స్' దేశవ్యాప్త విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లోకి ప్రవేశించింది. రాజ్‌భవన్ రోడ్‌లో తన 11వ స్టోర్‌ను ప్రారంభించిన ఈ సంస్థ, ల్యాబ్‌గ్రోన్ పోల్కీ విభాగంలో మార్కెట్ లీడర్‌గా ఎదుగుతూ దక్షిణాది మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. సూరత్‌కు చెందిన ప్రపంచ స్థాయి తయారీ నైపుణ్యంతో రూపొందిన ఈ ఆభరణాలు అటు సంప్రదాయ హస్తకళను, ఇటు ఆధునిక సాంకేతికతను ప్రతిబింబిస్తాయని సంస్థ డైరెక్టర్ యోగిత్ జిందాల్ తెలిపారు. ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో విజయవంతమైన ఈ బ్రాండ్, ఇప్పుడు బెంగళూరుతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లోనూ ఔట్‌లెట్లను ఏర్పాటు చేయనుంది. వినియోగదారుల నమ్మకం కోసం ఐజిఐ, ఎస్‌జిఎల్ సర్టిఫైడ్ వజ్రాలను అందిస్తూ, సహజ వజ్రాల తరహాలోనే బైబ్యాక్, ఎక్స్ఛేంజ్ పాలసీలను కూడా అమలు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. నటి మౌనీ రాయ్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ఇవానా జువెల్స్, నాణ్యతలో రాజీ పడకుండానే సరసమైన ధరలకే ప్రీమియం డిజైన్లను అందుబాటులోకి తెచ్చింది.

## బాలుడికి కాలేయ మార్పిడి చికిత్స



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** గ్లయికోజెన్ స్టోరేజ్ డిసీజ్ టైప్3తో బాధపడుతున్న 22 నెలల వయస్సు ఉన్న బాలుడికి ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్యులు కాలేయ మార్పిడి చికిత్స జరిపి పునర్జన్మనిచ్చారు. వంశపారంపర్య జీవక్రియ సంబంధిత కాలేయ రుగ్మతతో బాధపడుతున్న బాలుడికి ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్యులు సజీవ దాత కాలేయ మార్పిడిని విజయవంతంగా నిర్వహించారు. ఈ రుగ్మతకు చికిత్స చేయకపోతే పదే పదే రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గడం, కండరాల బలహీనత, కాలేయం వాపు, క్రమంగా అవయవాలు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఉడన్‌గడ్డ నివాసులైన మాస్టర్ మొహమ్మద్ అఫాన్(22 నెలలు) అధిక ఆకలి, కడుపు ఉబ్బరం, తెల్లవారుజామున నీరసం, నిద్రమత్తుగా ఉండటం వంటి లక్షణాలతో బాధపడుతుండటంతో తండ్రి వైద్యం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. వివిధ పరీక్షలు నిర్వహించిన అనంతరం కాలేయ సంబంధిత సమస్య ఉన్నట్లుగా గుర్తించారు. క్రమంగా కాలేయానికి నష్టం కలిగించి, మెదడు, గుండె, అస్థి కండరాలను ప్రభావితం చేసే సమస్యలకు దారితీస్తుంది. తండ్రి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ పూల అలంకరణ కార్యక్రమాలలో రోజువారీ కూలీగా పనిచేస్తారు. రోగికి ఎటువంటి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ పథకం కింద ఈ చికిత్సను చేపట్టారు. ఈ క్రమంలోనే బిడ్డ ఎంజైమ్ లోపం ఉన్న కాలేయాన్ని, తండ్రి నుంచి సేకరించిన ఆరోగ్యకరమైన కాలేయంతో మార్చడం జరిగింది. ఉస్మానియా సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో తండ్రి దానం చేసిన సుమారు 240 గ్రాముల కాలేయ కణజాలంతో ప్రొఫెసర్ మధుసూధన్ సారథ్యంలో చికిత్స నిర్వహించారు. ఇదే చికిత్స ప్రైవేట్ ఆసుపత్రిలో నిర్వహించాలంటే సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలు ఖర్చవుతుంది.

## ప్రభుత్వ పాఠశాలలను.. సెమీ రెసిడెన్షియల్స్‌గా మార్చాలి

### అసమానతలు లేని శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలి
### -ప్రైవేటు విద్యా వ్యవస్థను రద్దు చేయాలి
### -టిపిటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సులో వక్తలు డిమాండ్




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** కామన్ స్కూల్ విద్యా విధానం, శాస్త్రీయ విద్య అమలు, ప్రైవేట్ స్కూల్స్ రద్దు ఎజెండాగా సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన టిపిటిఎఫ్ రాష్ట్ర సదస్సులో పలువురు వక్తలు పాల్గొన్న ప్రసంగించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో కొనసాగుతున్న అంతరాలను నిర్మూలించడంలో విద్య ప్రధాన భూమిక వహించాలని, అందుకుగాను అందరికీ సమానమైన, శాస్త్రీయ విద్య ఉచితంగా అందించాల్సిన అవసరం ఉందని టీపిటిఎఫ్ భావిస్తున్నదని, తదనుగుణంగా ప్రభుత్వం విద్యా విధానాలను రూపొందించాలని కోరారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వంచే ఏర్పాటైన విద్యా కమీషన్ విడుదల చేసిన రిపోర్టును పరిశీలిస్తే సామాజిక, మానవీయ కోణంలో విద్యారంగ సిఫార్సులు లేవని, అందరికీ సమానమైన, నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే మౌలికమైన రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా సిఫార్సులు ఉన్నాయన్నారు. సమావేశంలో పాల్గొన్న టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి విద్యారంగ అంశాలపై సమావేశంలో కీనోట్ ప్రవేశపెడుతూ... కామన్ స్కూల్ ఏర్పాటు దిశలో ఒక విద్యా ఉద్యమం ప్రజా ఉద్యమంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జాతీయ విద్యా విధానం రాజ్యాంగ విలువలు అంశంపై ఎఐఎఫ్ఆర్‌టిఇ అధ్యక్షవర్గ సభ్యుడు ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ, విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాశాయీకరణ ద్వారా తమ లక్ష్యాన్ని రాజకీయ ఎజెండాను పాలకులు సాధించాలనుకుంటున్నారని మండిపడ్డారు. భారతదేశం లౌకిక దేశం అని మరిచి పాఠ్య పుస్తకాలలో మతభావజాలాన్ని చొప్పించి, దేశభక్తి జాతీయవాదం పేరుతో హిందూ మతతత్వాన్ని తరగతి గదుల్లో ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన టిజెఎస్ అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం మాట్లాడుతూ, ఉపాధ్యాయునికి తరగతి గదే సమాజమని, ప్రభుత్వ విద్య సంక్షోభంలో ఉందని, ప్రభుత్వ విద్యను కాపాడేందుకు ప్రగతిశీల సంఘాలన్నీ ఉపాధ్యాయ సంఘాలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రొఫెసర్ కె.లక్ష్మి నారాయణ, ఏపిటిఎఫ్ పూర్వ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకుడు పి.నాగిరెడ్డి, అకాడమిక్ సెల్ కన్వీనర్ ఎం.ప్రకాష్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.తిరుపతి రెడ్డి, ఎం.రవీందర్, పి.నారాయణమ్మ, డి.శ్రీనివాస్, లక్ష్మయ్యయాదవ్, యం.కృష్ణారెడ్డి, రావుల రమేష్, ఏ.భుజంగ రావు, డి.రాజయ్య, బి.రాజు, యస్.విజయ్, భోగ రమేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## పది ఫలితాల్లో శ్రీ చైతన్య రికార్డు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీ చైతన్య స్కూల్ అద్భుతమైన 597 మార్కులతో అగ్రస్థానంలో నిలిచిందని శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. 580 మార్కులకి పైగా సాధించిన వారు 829 మంది, 570 మార్కులకి పైగా సాధించిన వారు 2,303 మంది, 560 మార్కులకి పైగా సాధించిన వారు 3,954 మంది, 550 మార్కులకి పైగా సాధించిన వారు 5,521 మంది ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా అద్భుతమైన ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీమ మాట్లాడుతూ శ్రీ చైతన్య స్కూల్ బ్రాంచ్‌లు ఉన్న మెజారిటీ జిల్లాల్లో, మండలాల్లో, పట్టణాలు, నగరాల్లో టాప్ మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంతటి భారీ విజయానికి మరే ఇతర విద్యాసంస్థ కూడా సమీపంలో లేదని అన్నారు. ఈ గొప్ప విజయానికి కారణమైన విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధనా సిబ్బందిని అభినందించారు.

## బిసి కులగణన, మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి: మధుసూదనాచారి



**పజాపక్షం / హిమాయత్‌నగర్:** కులగణనతోపాటు బిసి మంత్రిత్వశాఖ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి కేంద్రప్రభుత్వాన్ని కోరారు. చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు తేవాలని, జనాభా దామాషా ప్రకారం వాటా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. మోదీ పిఎం అయిన తర్వాత బిసిల పరిస్థితి పెనం మీద పొయ్యిలో పడిందని విమర్శించారు. బిసిల హామీలు తుంగలో తొక్కి, వారి ఆశల మీద నీళ్లు చల్లారని మండిపడ్డారు. ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో ఒబిసి కోటాపై తేల్చాలని కోరారు.

## హైదరాబాద్‌లో ఫర్టిలిటీ సెంటర్లపై గుజరాత్ పోలీసులు సోదాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఫర్టిలిటి సెంటర్లపై గుజరాత్ పోలీసులు గురువారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. గుజరాత్ పోలీసుల దర్యాప్తు బృందం నగరంలోని పలు ఫర్టిలిటీ సెంటర్లపై అకస్మాత్తుగా సోదాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. చిన్నారుల అక్రమ రవాణా (చైల్డ్ ట్రాఫికింగ్) కేసులో కీలక ఆధారాల కోసం ఈ దాడులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గుజరాత్‌లో నమోదైన కిడ్నాప్ కేసు దర్యాప్తులో బయటపడిన అంతర్రాష్ట్ర రాకెట్‌కు హైదరాబాద్‌తో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో, గుజరాత్ పోలీసులు తెలంగాణ పోలీసుల సహకారంతో ఈ సోదాలు నిర్వహించారు. కూకట్‌పల్లి, బంజారాహిల్స్, సికింద్రాబాద్ ప్రాంతాల్లోని కొన్ని ఫర్టిలిటీ సెంటర్లలో విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. దర్యాప్తులో మురుగన్ గ్యాంగ్ పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్న నెట్‌వర్క్ చిన్నారులను అపహరించి విక్రయిస్తున్నట్లు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ గ్యాంగ్ గత ఏడాదిలో పలువురు శిశువులను అక్రమంగా విక్రయించినట్లు గుజరాత్ పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, శిశువుల అక్రమ దత్తత లేదా విక్రయాలకు ఫర్టిలిటీ సెంటర్లతో సంబంధాలు ఉన్నాయా అన్న కోణంలో అధికారులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సోదాల సందర్భంగా పలు పత్రాలు, రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. అవసరమైన వారిని ప్రశ్నించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈ ఘటనతో నగరంలోని ఫర్టిలిటీ సెంటర్ల కార్యకలాపాలపై మరింత నిఘా పెరగనున్నట్లు తెలుస్తోంది.ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా పూర్తి వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

# విద్య ద్వారానే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి

## డిండి ప్రాజెక్టు పూర్తి చేయడంతో దేవరకొండ సస్యశ్యామలం... యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపనలో మండలి చైర్మన్ గుత్తా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ/కొండమల్లేపల్లి :** విద్య ద్వారానే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి శివారులో 200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, పేదలకు వీటిని అందించేందుకు పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళుతున్నదని, ఇందులో భాగంగానే నియోజకవర్గానికి ఒక్కటి చొప్పున 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు 23,000 కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, 29వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, 18లక్షల50వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు విద్యతో పాటు, అన్ని ఉచితంగా అందించాల్సిన అవసరం ఉందని, ఎక్కడ విద్య ఉంటే అక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. గతంలో తాను ఎంపిగా ఉన్న సమయంలో దేవరకొండకు తాగు, సాగు నీటి సౌకర్యాలకు కృషి చేయడం జరిగిందని, ఎస్ఎల్‌బిసి సొరంగం, పెండ్లిపాకల రిజర్వాయర్, నక్కలగండి, డిండి ప్రాజెక్టు కింద చింతపల్లి, గోపనపల్లి రిజర్వాయర్లు, 18 కిలోమీటర్ల లింక్ కెనాల్ పూర్తిచేయాల్సి ఉందని, దీని ద్వారా మూడు లక్షల ఎకరాలకు సాగునీరు లభిస్తుందని, డిండి ప్రాజెక్టు పూర్తి అయితే రానున్న రెండేళ్లలో దేవరకొండ సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉందని అన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సమాజం బాగుపడాలంటే విద్య ఒక్కటే మార్గం అని భావించి రాష్ట్ర ప్రభుత్వం 200కోట్లతో ప్రతి నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా 2563 మంది విద్యార్థులు ఒకే చోట చదువుకునే విధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని తెలిపారు. కొండమల్లేపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులను సంవత్సరం లోపు పూర్తి చేయాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నల్గొండ నుండి డిండి వరకు 324 కోట్లతో నాలుగు లైన్ల రహదారి నిర్మిస్తున్నామని, దేవరకొండ నియోజకవర్గంలోని 74 కోట్లతో కొన్ని రోడ్లను చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రి, హైకోర్టు బిల్డింగ్‌ల పనులు పూర్తిచేస్తున్నామని, బ్రహ్మణవెల్లేంల ద్వారా 40వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, దేవరకొండ నియోజకవర్గానికి తాగునీటి సమస్యను తీర్చేందుకు మిషన్ భగీరథ ద్వారా నీరు అందించే విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడుతానని, ఆదే విధంగా నేరేడుగొమ్ము 132/11కేవి సబ్ స్టేషన్ సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంఎల్‌ఎ నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ఒకే పాఠశాలలు అందరూ చదివే విధంగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈడబ్ల్యుఐడిసిఎస్ఈ బాలప్రసాద్, ఆర్డీవో రమణారెడ్డి, డిఈవో బిక్షపతి, మార్కెట్ కమిటి చైర్మన్ జమున, మాజీ ఎంపిపి రేఖా శ్రీధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, సురేష్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులను గౌరవిస్తూనే ఆదుకుంటాం




## ప్రజాప్రభుత్వం తరపున పూర్తి ప్రోత్సాహం
## డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం / రవీంద్రభారతి :** తెలంగాణ రాష్ట్రం కళలకు పురిటిగడ్డ అని, కళకారులను గౌరవించి ఆదుకోవడంలో ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లుభట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం తరపున కళాకారులకు పూర్తి ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. శ్రీ సోమశేఖర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ కల్చరల్ సొసైటీ కిన్నెర సంస్థ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వివిధ రంగాలకు చెందిన కళకారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మృదంగ వాద్య కారుడు డాక్టర్ ఎల్లా వెంకటేశ్వరరావును డిప్యూటీ సిఎం ఘనంగా సత్కరించి, మాట్లాడారు. కళాకారులు కళల ద్వారా సామాజిక సందేశాన్ని ప్రజలకు చేరవేయాలని సూచించారు. కళలు సామాజిక వికాసానికి ఆయుధాలు అని పేర్కొన్నారు. పూర్వకాలంలో సమాజంలోని అనేక రుగ్మతలను తొలగించేందుకు కళారూపాలు ఎంతో కృషి చేశాయని గుర్తుచేశారు. నేడు కూడా రాష్ట్ర ప్రభుత్వం సామాజిక అభివృద్ధి కోసం, సామాజిక రుగ్మతల నిర్మూలనకోసం పాలనతోపాటు కళలను కూడా ఒక సాధనంగా ఉపయోగిస్తున్నదని తెలిపారు. ఈ ప్రయత్నంలో కళాకారులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారతీయ శాస్త్రీయ సంగీతంలో మృదంగ వాద్యానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చి పెట్టిన మహనీయుడు ఎల్లా వెంకటేశ్వరరావు అని కొనియాడారు. 83 ఏళ్ల వయసులో కూడా వెంకటేశ్వరరావు మృదంగాన్ని అంత శక్తివంతంగా వాయిస్తున్నారంటే, అది కళల పట్ల వారికి ఉన్న మక్కువ, ఆయన నిరంతర సాధనవల్లే సాధ్యమైందని తాను నమ్ముతున్నట్టు పేర్కొన్నారు. సభకు ముందు గాయిని గాయకులు సినీగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ డా.అలేఖ్య పుంజాల, ప్రముఖ సంగీత దర్శకులు విశ్వనాథ్, డిప్యూటీ డైరెక్టర్ పెంచలయ్య పాల్గొన్నారు.

# 100 శాతం వాటా విక్రయించాం

## ఎల్ అండ్ టి స్పష్టం

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ (ఎల్‌టీఎంఆర్‌హెచ్‌ఎల్)లో పూర్తి వాటాను విక్రయించినట్లు లార్సెన్ అండ్ టూబ్రో ప్రకటించింది. ఏప్రిల్ 29న తెలంగాణ ప్రభుత్వ యాజమాన్యంలోని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్)తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. ఒక పరిణతి చెందిన మౌలిక సదుపాయాల అసెట్ నుంచి విలువ ఆధారిత నగదీకరణను పొందడం ఈ విక్రయ ఉద్దేశ్యమని సంస్థ పేర్కొంది. డెవలప్‌మెంట్ ప్రాజెక్టుల పోర్ట్‌ఫోలియో నుంచి నిష్క్రమించి, ఆ మూలధనాన్ని ప్రధాన ఇంజనీరింగ్, సాంకేతిక ఆధారిత వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టాలనే విస్తృత వ్యూహానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఎల్ అండ్ టీ ప్రకటించింది. ఎల్‌టీఎంఆర్‌హెచ్‌ఎల్ ద్వారా నిర్వహిస్తున్న హైదరాబాద్ మెట్రో ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్(పీపీపీ) మెట్రో రైల్ ప్రాజెక్టులలో ఒకటి. మూడు కారిడార్లలో సుమారు 69 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ ప్రాజెక్ట్, తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టిన ఒక చరిత్రాత్మక పట్టణ ప్రాంత మౌలిక సదుపాయం. ఎల్ అండ్ టి అభివృద్ధితో వినియోగంలోకి వచ్చిన ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ ప్రతిభకు, పట్టణ ప్రాంత రవాణా సొల్యూషన్స్, స్థిరమైన మౌలిక సదుపాయాలకు ఒక బెంచ్‌మార్క్‌గా నిలిచింది. ఈ ప్రాజెక్ట్ హైదరాబాద్‌లో కనెక్టివిటీని గణనీయంగా మెరుగుపరచడమే కాకుండా, ఈ ప్రాంత ఆర్థిక వృద్ధికి, పట్టణ అభివృద్ధికి తోడ్పడింది. కొనుగోలు అనంతరం మెట్రో నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ యోచిస్తోంది. దీనివల్ల భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ ప్రాంత రవాణా రంగంలో ఈ అసెట్ ప్రాధాన్యత మరింతగా పటిష్టమవుతుంది. లావాదేవీ దీర్ఘకాలిక విలువను సృష్టించడం, ప్రధాన సాంకేతిక ఆధారిత వ్యాపారాల పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేసుకోవడంపై ఎల్ అండ్ టి నిరంతరం కృషి చేస్తుండే విషయాన్ని ప్రతిబింబిస్తుందని సంస్థ పేర్కొంది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఒక ప్రపంచ స్థాయి అసెట్. నగరాల రూపురేఖలను మార్చగలిగే, జీవన నాణ్యతను మెరుగుపరిచే భారీ మౌలిక సదుపాయాలను అందించడంలో మా సామర్థ్యాలకి ఇది ఒక మంచి ఉదాహరణ అని సంస్థ స్పష్టం చేసింది.

**దీర్ఘకాలిక విలువ సృష్టిస్తుంది**

తెలంగాణ ప్రభుత్వ పర్యవేక్షణలో ఈ ప్రాజెక్ట్ మరింత వృద్ధి చెందుతుందని, వాటాదారులందరికీ దీర్ఘకాలిక విలువను సృష్టిస్తుందని మేము నమ్ముతున్నామని ఎల్ అండ్ టీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ తెలపారు. దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రణాళికలో భాగంగా విలువను సృష్టించే దిశగా సాగుతున్న ఎల్ అండ్ టీ ప్రస్థానంలో ఇదొక కీలక మైలురాయి, పీపీపీ ఫ్రేమ్‌వర్క్ కింద భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను రూపొందించడం, అమలు చేయడం, నిర్వహించడంలో ఎల్ అండ్ టీ సామర్థ్యానికి హైదరాబాద్ మెట్రో ఒక నిదర్శనంగా నిలుస్తుందని ఆయన తెలిపారు. నగరంలో పట్టణ ప్రాంత రవాణా మరియు కనెక్టివిటీని పెంపొందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోందని... ఈ పరివర్తనాత్మక ప్రయాణంలో భాగమైనందుకు మేము గర్విస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ సంస్థ మరిన్ని కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని మేము విశ్వసిస్తున్నామని.. ఎల్ అండ్ టీ సీఎండీ సలహాదారు(డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్స్) డికె సేన్ పేర్కొన్నారు.

# మే చివరి నాటికి డబుల్ బెడ్‌రూమ్‌ల కేటాయింపు పూర్తి

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలను మే నెల చివరి నాటికి పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాల ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే, లబ్ధిదారులే స్వయంగా నిర్మించుకునేలా అవకాశం కల్పిస్తామన్నారు. ఇందుకు అవసరమైన వ్యయాన్ని ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందజేస్తామన్నారు. ఈ పనుల కోసం గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

**అనర్హుల తొలగింపు – అర్హులకు ప్రాధాన్యం**

సమీక్షలో పలువురు ఎమ్మెల్యేలు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లలో అనర్హులు నివసిస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే అనర్హులను గుర్తించి తొలగించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇండ్లు తీసుకుని అక్కడ నివసించకుండా, అద్దెకు ఇస్తున్న వారి కేటాయింపులను రద్దు చేయాలన్నారు. రూ. 400 కోట్లతో కాలనీల్లో విద్యుత్, తాగునీరు, డ్రైనేజి వంటి మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడితే అధికారులను సర్వీసు నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

**భూముల పరిరక్షణ – జాయింట్ సర్వే**

ప్రభుత్వ భూముల పరిరక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి అన్నారు. సరిహద్దు వివాదాల పరిష్కారానికి రెండు శాఖలు కలిసి జాయింట్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతికతతో శాస్త్రీయంగా భూములను గుర్తించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం ఇస్తున్న 40 టన్నుల ఉచిత ఇసుక దుర్వినియోగం కాకుండా కలెక్టర్లు నిఘా పెట్టాలని, ఇందుకోసం ప్రత్యేక పాలసీ తీసుకురావాలని సూచించారు.

**సోలార్ ప్లాంట్ ప్రారంభం**

సమీక్షకు ముందు హౌసింగ్ కార్పోరేషన్ కార్యాలయంలో 30 కె.వి. సామర్థ్యం కలిగిన రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ను మంత్రి ప్రారంభించారు. దీని ద్వారా నెలకు సుమారు 4,500 యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు దామోదర్ రాజనరసింహ, తుమ్మల నాగేశ్వరరావు, డి. శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపి సివి ఆనంద్‌ను పోలీసు అకాడమీలో గురువారం అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

# చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఎయిర్‌పోర్ట్ తరహా యాక్సెస్ కంట్రోల్

## రద్దీ తగ్గింపునకు దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ నగర తూర్పు కారిడార్‌లో కీలక కేంద్రంగా ఎదుగుతున్న చర్లపల్లి రైల్వే స్టేషన్లో ప్రయాణికుల సౌకర్యం కోసం దక్షిణ మధ్య రైల్వే మరో ముందడుగు వేసింది. స్టేషన్ దక్షిణ భాగంలో ఎయిర్‌పోర్ట్ మాదిరి యాక్సెస్ కంట్రోల్ సిస్టమ్‌ను త్వరలో అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ చర్యతో రద్దీ నియంత్రణ, వాహనాల క్రమబద్ధీకరణ, అనధికార పార్కింగ్ నిర్మూలన లక్ష్యంగా పెట్టుకుంది. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ, లింగంపల్లి టెర్మినల్స్‌పై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు చర్లపల్లిని ఆధునిక కోచింగ్ టెర్మినల్‌గా అభివృద్ధి చేశారు. నూతన దక్షిణ టెర్మినల్ భవనంలో విశాలమైన వెయిటింగ్ హాళ్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఆధునిక టాయిలెట్లు, మెరుగైన సమాచార వ్యవస్థలు ఏర్పాటు చేశారు. అదనంగా 6,622 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పార్కింగ్ సౌకర్యం కల్పించారు. కొత్త యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థలో భాగంగా వాహనాల ప్రవేశం, నిష్క్రమణను డిజిటల్ టికెటింగ్ ద్వారా పర్యవేక్షిస్తారు. పికప్, డ్రాప్ కోసం 20 నిమిషాల వరకు ఉచిత సమయం ఇవ్వబడుతుంది. ఆ తర్వాత కాలవ్యవధి ఆధారంగా ఛార్జీలు విధిస్తారు. వాణిజ్య వాహనాలకు కూడా ప్రత్యేక నియమాలు అమలు చేస్తారు. ఇక స్టేషన్ ముందు భాగంలో పాదచారుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా, రెండు, మూడు, నాలుగు చక్రాల వాహనాలకు ప్రత్యేక లేన్లు ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా ఆటోలు, టాక్సీలు, ఇతర రవాణా సౌకర్యాలు సులభంగా లభించనున్నాయి. ఇలాంటి వ్యవస్థ ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో అమలులో ఉండగా, చర్లపల్లిలో కూడా త్వరలో కార్యరూపం దాల్చనుంది. ఈ నిర్ణయంతో ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, భద్రమైన ప్రయాణ అనుభవం లభించనుందని అధికారులు భావిస్తున్నారు.



# హాస్టళ్ల డైట్ చార్జీలు రాక ఇబ్బందులు

## పెండింగ్ బిల్లులకు ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్

**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** పెండింగ్‌లో ఉన్న హాస్టళ్ల డైట్‌చార్జీలు తక్షణమే విడుదల చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌టి హాస్టళ్లలో ఎనిమిది నెలలుగా , ఎస్‌సి, బిసి హాస్టళ్లలో నాలుగు నెలలుగా డైట్, కాస్మోటిక్, అద్దె, వర్కర్స్ జీతాలు, ఇతర బిల్లులు రాక ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. హాస్టళ్ల నిర్వహణకు తప్పని పరిస్థితుల్లో వెల్ఫేర్ ఆఫీసర్లు అప్పులు చేసి తిప్పలు పడుతున్నారని తెలిపారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశానికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. గతంలోనే డైట్ చార్జీలను గ్రీన్‌చానెల్ ద్వారా విడుదల చేస్తామని చెప్పి, ఇప్పటికీ అది అమలుకు నోచుకోలేదని విమర్శించారు. బిల్లులు రాక సరుకుల సరఫరా ఆగిందన్నారు. దీంతో హాస్టళ వెల్ఫేర్ అధికారులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. హాస్టళ్ల సక్రమ నిర్వహణకు నెలకు రూ.50వేల చొప్పున చెల్లించాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్, నేతలు సి.రాజేందర్, నర్సింహ్మా, గొరిగె మల్లేశ్, శివకుమార్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ఫాంహౌస్ బేరం పెడితే..

# భూముల విలువ తేలిపోతుంది

## బిఆర్‌ఎస్‌కు సూచించిన ఎంఎల్‌ఎ రామ్మోహన్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్ ఫాంహౌజ్‌తో పాటు నందినగర్‌లోని ఇంటిని మార్కెట్‌లో బేరం పెడితే రాష్ట్రంలో భూముల విలువలు పెరిగాయో తగ్గాయో తేలిపోతుందని భూముల విలువలు తగ్గాయని ఆరోపిస్తున్న బిఆర్‌ఎస్ నేతలకు పరిగి ఎంఎల్‌ఎ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ, లక్షలాది రేషన్ కార్డుల జారీ వంటి పథకాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేసి, రైతు భరోసా అందిస్తున్నామని చెప్పారు. బిఆర్‌ఎస్ నేతలు కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు గ్రామాలకు వెళ్లి ప్రస్తుత పరిస్థితిని పరిశీలించాలని సవాల్ చేశారు. రైతుల గురించి కెటిఆర్ జోకర్‌లా మాట్లాడుతున్నారని విమర్శించారు.

# తెలంగాణలో అద్భుతమైన క్రీడాభివృద్ధి

## ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో అద్భుతమైన క్రీడాభివృద్ధి అవకాశాలు ఉన్నాయని ఆయన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆధ్వర్యం గచ్చిబౌలి స్టేడియంలో గురువారం నిర్వహించిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ సమ్మిట్2026లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దేశంలోని క్రీడా విధానాలు విద్య పరిశోధన, సాంకేతిక ఉపాధి అవకాశాలపై ఈ సమ్మిట్ లో చర్చించారు.ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో బలమైన, స్థిరమైన క్రీడా వ్యవస్థను నిర్మించడంఈ యూనివర్సిటీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. క్రీడారంగంలో ఉన్నత స్థాయి విద్య, శిక్షణ అందించేందుకు, యువ క్రీడ నైపుణ్యాన్ని మెరుగు దిద్దేందుకు ఏర్పాటుచేసిన ఈ యూనివర్సిటీలో నిష్ణాతులు పాలసీ మేకర్స్ మేధావులు పాల్గొనడం సంతోషకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర క్రీడాభివృద్ధిలో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ స్పోర్ట్స్ యూనివర్సిటీ దిక్సూచిలా పనిచేస్తుందని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ఆశయం మేరకు చేపడుతున్న అనేక క్రీడాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు జరిగిందన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోని బాలాదేవి,స్పోర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కిషోర్ గోపీనాథన్, రాష్ట్ర ప్రభుత్వ మాజీ క్రీడల సలహాదారులు డాక్టర్ చిన్నపరెడ్డి , అధికారులు రవీందర్ అశోక్ కుమార్, పద్మశ్రీ పుల్లెల గోపీచంద్, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు ఇస్మాయిల్ బేగ్, నాగపురి రమేష్, అర్జున అవార్డు గ్రహీత జె జె శోభ, ఒలంపియన్ నేహా అగర్వాల్ వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు క్రీడారంగ నిష్ణాతులు క్రీడాకారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పోలీసుల ‘వ్యూహం’.. దేశానికే ‘దిక్సూచి’

## ‘మ్యూల్’ ఖాతాల వేటకు జాతీయ కార్యాచరణ : రంగంలోకి సిబిఐ, ఆర్‌బిఐ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరగాళ్ల అక్రమ సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు హైదరాబాద్ పోలీసులు ఎక్కుపెట్టిన ‘ఆపరేషన్ ఆక్టోపస్’ అస్త్రం ఇప్పుడు దేశవ్యాప్త సమరానికి దిక్సూచిగా మారింది. డిజిటల్ ఆర్థిక మోసాల్లో కీలకమైన ‘మ్యూల్’ ఖాతాల అక్రమ చలామణీని ఛేదించడంలో హైదరాబాద్ పోలీసులు సాధించిన అద్భుత విజయాలను కేంద్ర ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్) ఒక ఆదర్శ నమూనాగా తీసుకుంది. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి నేతృత్వంలో ఢిల్లీలో గురువారం కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనర్ పాల్గొన్నారు. పంజా విసురుతున్న సైబర్ మాయగాళ్లకు అడ్డుకట్ట వేసేందుకు హైదరాబాద్ పోలీసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ఆపరేషన్ ఆక్టోపస్’, నేరగాళ్ల నెట్‌వర్క్‌ను మూలాల నుంచి దెబ్బతీసింది. ఇందులో 32 మంది బ్యాంక్ అధికారులను నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముఖ్యంగా అమాయకుల పేరిట తెరిచే మ్యూల్ ఖాతాలను నేరగాళ్లు ఎలా వినియోగించుకుంటున్నారో పక్కా ఆధారాలతో సహా బహిర్గతం చేయడంతో కేంద్రం అప్రమత్తమైంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ అందించిన క్షేత్ర స్థాయి నివేదికల ఆధారంగా సిబిఐ,ఆర్‌బిఐ వంటి అగ్రశ్రేణి సంస్థలతో పాటు వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులతో కేంద్రం ప్రత్యేక సమీక్ష నిర్వహించింది. ఈ భేటీలో హైదరాబాద్ పోలీసుల పనితీరును ప్రత్యేకంగా కొనియాడడమే కాకుండా, ఇక్కడి విజయవంతమైన మోడల్‌ను దేశమంతటా అమలు చేయాలని నిర్ణయించింది. నేరగాళ్ల వేటలో మరింత వేగం పెంచేందుకు ‘మ్యూల్ హంటర్.ఎఐ’ అనే కృత్రిమ మేధస్సు సాధనాన్ని తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని ఆర్‌బిఐ బ్యాంకులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. సమన్వయ లోపం లేకుండా పోలీసులు, బ్యాంకులు రియల్ టైం డేటాను పంచుకోవాలని, ఎస్ఎల్‌బిసిల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశం దిశానిర్దేశం చేసింది. హైదరాబాద్ పోలీస్ యంత్రాంగం ప్రదర్శించిన ఈ కార్యదక్షత మిగిలిన రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకమని కేంద్ర అధికారులు అభిప్రాయపడ్డారు. వెరసి, హైదరాబాద్ పోలీసుల అలుపెరగని పోరాటం ఇప్పుడు దేశవ్యాప్త సైబర్ భద్రతకు ఒక కొత్త మార్గదర్శిగా నిలుస్తూ, మోసగాళ్ల ఆట కట్టించేందుకు యావత్ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసింది.

# పాంచజన్యంతో రాజకీయ పార్టీల్లో వణుకు

## వచ్చేది తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వమే

## టిఆర్ఎస్ నాయకులు రూప్‌సింగ్, శ్రీకాంత్ గౌడ్, రవిచంద్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత ‘పాంచజన్యం’ పేరుతో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించడంతో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీల్లో వణుకు మొదలైందని టిఆర్ఎస్ నాయకులు అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో గురువారం మీడియాతో పార్టీ నాయకులు రూప్ సింగ్, శ్రీకాంత్ గౌడ్, చిలుక ప్రవీణ్, లోక రవిచంద్ర మాట్లాడుతూ ప్రజల సమస్యలను గాలికి వదిలేసి ఫామ్ హౌస్‌కే పరిమితమైన కెసిఆర్‌ను కవిత ప్రశ్నిస్తే, బిఆర్ఎస్ నేతల కంటే కాంగ్రెస్ నాయకులే ఎక్కువగా స్పందించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన అనంతరం సామాన్య కార్యకర్తలను కెసిఆర్ పట్టించుకోలేదని, తప్పులు సరిదిద్దుకోవాలని చెప్పడం తప్పా? అని రూప్ సింగ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బంజారాలకు మంత్రి పదవి అడిగే ధైర్యం లేని రాములు నాయక్ వంటి వారు కవిత గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ నాయకులు దానం నాగేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు కెసిఆర్‌పై లేని ప్రేమను నటిస్తున్నారని శ్రీకాంత్ గౌడ్ విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చుతున్న రేవంత్ రెడ్డిని కర్కోటకుడు అని కాకుండా ఏమనాలన్నారు. అధికారం ఎటు ఉంటే అటు తిరిగే దానం నాగేందర్ వంటి పొద్దుతిరుగుడు పూలకు కవితను విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. పార్టీ పెట్టిన వారం రోజులకే మూడు ప్రధాన పార్టీలు ఏకమై కవితపై దాడి చేస్తున్నాయని చిలుక ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దళితుల సమస్యలను వదిలేసి, రేవంత్ రెడ్డి వద్ద ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. ముఖ్యమంత్రి సోదరులు దళితుల భూములు గుంజుకుంటున్నా నోరు మెదపని నేతలు కవితపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. తమకు పాత కెసిఆర్‌తో ఎలాంటి గొడవ లేదు, కానీ మారిన ‘మర మనిషి’ కెసిఆర్‌తోనే తమ పంచాయితీ అని రవిచంద్ర అన్నారు. వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

